క్లుప్తంగా

అప్రోచ్ రోడ్డు సరిచేయండి సారూ !



ఇంకొల్లు (చినగంజాం): హనుమోజీ పాలెం వద్ద ఆర్ అండ్ బీ రోడ్డులో ఆలేరు వాగుపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. కాస్తంత వర్షం పడిందంటే వర్షపు నీరు నిలిచి కుంగిన రోడ్డు కారణంగా ఏర్పడిన గుంతలు కన్పించకుండా పోవడం వాహదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఫలితంగా వంతెనపై ప్రయాణించాలంటే వాహనదారులు తమ వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. వర్షపు నీరు నిలిచిన సమయంలో గుంతలు కన్పించక పోవడంతో కిందపడిపోయి తీవ్రగాయాల పాలవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వాహనదారులు ఇంకొల్లు, చీరాల వెళ్లేందుకు ఈ మార్గం గుండా వెళ్లాల్సి రావడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుంగిన అప్రోచ్ రోడ్డును అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

బల్లికురవ/అద్దంకి: రెండు నెలలుగా ఎండలు, వడగాల్పుల ఉధృతితో విలవిడల్లాడిన ప్రజలకు నాలుగు రోజులగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం మండలంలోని వల్లాపల్లి, మల్లాయపాలెం, కొప్పరపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, గ్రామాల్లో కూడా చిరుజల్లులు కురిశాయి. ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో జల్లులు కురవటతో ఈఏడాది రుతుపవనాలు ముందుగానే ప్రవేశించాయని రైతలు సంతోషం వ్యక్తం చేశారు. అడపాదడపా కురుస్తున్న చిరుజల్లులకు దుక్కులు దున్నేందుకు కూడా రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉంటాయని పంటలు బాగా పండుతాయని రైతులు నమ్ముతున్నారు. మరో వైపు వర్షాలను గమనించిన వ్యవసాయదారులు పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. వ్యవసాయాధికారులు సైతం ఆయా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, చిత్త నక్షత్రం, త్రయోదశి తిధి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం . మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఖాతాల్లోకి డబ్బులు
ఆనందంలో రైతులు

- రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి రాయితీ
- ఖరీఫ్ 2023 కరువు సాయం, మిచాంగ్ తుఫాన్ పరిహారం చెల్లింపు
- సైంధవుల్లా అడ్డుకున్న మహాకూటమి
- మండలంలో 1371 మంది రైతులకు లబ్ధి



బూదవాడ గ్రామంలో దుక్కిదున్నుతున్న రైతు

జే.పంగులూరు: రెండు నెలల క్రితం రావాల్సిన డబ్బులు కుటిల రాజకీయంతో ఆలస్యమయ్యాయి. ఎక్కడ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి లబ్ధిచేకూరుతుందేమోనని ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీలు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. దీంతో రైతుల ఖాతాల్లో నగదు జమకు తాత్కాలిక విరామం ఏర్పడింది. చంద్రబాబు మోసపూరిత రాజకీయాలతో నిలిచిపోయిన ఖరీఫ్ 2023 కరువు సాయం, మిచాంగ్ తుఫాన్ పంట నష్టపరిహారం (ఇన్ పుట్ సబ్సిడీ) రైతుల ఖాతాలోకి ప్రభుత్వం జమచేసింది. పోలింగ్ ముగిసే వరకు పథకాల చెలింపుపై ఎన్నికల కమిషన్ విధించిన ఆంక్షలు ఎత్తివేయడంతో శనివారం నుంచి రైతు ఖాతాల్లోకి డబ్బులు జమఅవుతున్నాయి. దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఖరీఫ్ సీజన్‌లో సాగుపై కొంత మేర ప్రభావం చూపించింది. ఈనేపథ్యంలో ఇన్‌పుట్ సబ్సిడీ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఖరీఫ్ సీజన్‌లో సిద్ధం చేసిన పంట నష్ట పరిహారాన్ని శనివారం నుంచి రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతున్నాయి. ఇప్పటికే వ్యవసాయాధికారులు జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. పంగులూరు మండలంలోని 21 గ్రామాల్లో ప్రధానంగా మినుము, మొక్కజొన్న, వరి, పొగాకు, మిర్చి పంటలను సాగు చేస్తున్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు పంట నష్టపరిహారం కింద మినుము పంటకు హెక్టారుకు రూ. 10 వేలు, వరి హెక్టారుకు రూ. 17 వేలు, పొగాకు హెక్టారుకు రూ.10 వేలు, మొక్కజొన్న హెక్టారుకు రూ. 17 వేలు, మిర్చి హెక్టారుకు రూ. 17000 వేలు పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లోకి జమవుతున్నాయి.

అడ్డుకున్న బాబు బృందం..

కరువు సాయంతోపాటు, మిచాంగ్ తుఫాన్ పరిహారం చెలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్చిలోనే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల షెడ్యూలు విడుదల అయ్యిందని చంద్రబాబు బృందం ఈసీకి ఫిర్యాదు చేసింది. రైతులకు డబ్బులు రాకుండా చేశారు.

మండలంలో పంట నష్టపరిహారం అందిన రైతులు..

పంట	భూమి (హెక్టార్లు)	రైతులు	నష్టం (రూ.లక్షల్లో)
మినుము	254	313	25,47,361
వరి	42.1	58	7,15,830
పొగాకు	56.16	91	5,61,669
మొక్కజొన్న	94.35	97	11,79,395
మిర్చి	411.79	812	70,00,345

ఆన్‌లైన్ చేసిన ప్రతి పంటకు నష్టపరిహారం..



ఆన్‌లైన్ చేసిన ప్రతి పంటకు నష్ట పరిహారం అందిస్తాం. మండల పరిధిలోని 21 గ్రామాలకుగాను 858.9 హెక్టార్లకు సంబంధించిన శనివారం నుంచి వారి ఖాతాల్లోకి పంట నష్టపరిహారం జమవుతోంది. మండలంలో 1371 మందికి పంట నష్టపరిహారం అందనుంది.

– ఏవో సుబ్బారెడ్డి, పంగులూరు, మండలం



మిచాంగ్ తుఫాన్ దెబ్బకు నీటమునిగిన పొగాకు (ఫైల్)



నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

గంగమ్మకు మొక్కులు తీర్చుకున్న భక్తులు



అలంకరణలో ఈర్లగంగమ్మ

బల్లికురవ: వైశాఖమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ఈర్లగంగమ్మ సన్నిధానం వద్ద భక్తులు తమతమ మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు, వలస వెళ్లిన రైతులంతా గ్రామాలకు చేరటంతో అమ్మవారి సన్నిధికి వెళ్లి పొంగళ్లు పెట్టి నివేదించారు. నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో ఈర్లకొండకు దిగువభాగంలో వేంచేసి ఉన్న ఈర్లగంగమ్మ ఆలయానికి ఆదివారం మండలంతోపాటు వివిధ మండలాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు కొత్తపాలెం, కొత్త మల్లాయపాలెం, పాత మల్లాయపాలెం, సోమవరప్పాడు, కొప్పరపాలెం, చెన్నుపల్లి, కొండాయపాలెం గ్రామాల్లోని భక్తులు ఉదయం 6 గంటల నుంచే అమ్మవారి సన్నిధికి చేరి ఎంతో విశిష్టత కలిగిన మర్రిచెట్టు వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించటం ఆనవాయితీ, అర్చకుడు చల్లగుండ్ల శ్రీనివాసరావు ఆయల కమిటి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేపట్టారు. పాడిపంటలతో తమ కుటుంబాలను చల్లగా చూడాలని అమ్మవారిని ప్రార్థించారు.

విజ్ఞానాన్ని పెంచేవి గ్రంథాలయాలు

చీరాల అర్బన్: విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు నీతి కథలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలను పుస్తక పఠనం చేయించారు. ఫ్యాకల్టీ కె.మోహన్‌చే ఇంగ్లిషు గ్రామర్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో 18మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం మార్టూరులో విద్యార్థులకు నీతి కథలతో పాటు జాతీయ నాయకుల జీవిత చరిత్రల కథలను అందుబాటులో ఉంచి చదివించారు. చదరంగం, లూడో, క్యారమ్స్ వంటి ఆటలను విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతులకు విద్యార్థులను పంపించి అవకాశాన్ని వినియోగించుకోవాలని జానకి రామరావు తల్లిదండ్రులను కోరారు.



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



మార్టూరు గ్రంథాలయంలో విద్యార్థులు

మదనగోపాలస్వామికి లక్ష మల్లెల పూజ



మల్లెపూలతో స్వామివారికి అర్చన నిర్వహిస్తున్న అర్చకులు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న మదనగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం 45వ వార్షికోత్సవ లక్ష మల్లెల పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు రావులకొల్లు పరాంకుశం వెంకట రంగాచార్యులు, చెన్నకృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం మహిళలచే విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున లక్ష మల్లెపూలతో మదనగోపాల స్వామిని అభిషేకించడం ద్వారా సకల ప్రాప్తి సిద్ధిస్తుందని అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

కన్నుల పండువగా స్వామివారి శాంతికల్యాణం



లక్ష తులసీదళార్చనలో మాధవస్వామి వారు



శాంతి కల్యాణం అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు పెదబజరు ప్రాంతంలో కొలువైన భూనీళా సమేత ప్రయాగ మాధవస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి శాంతి కల్యాణాన్ని ఆదివారం అత్యంత వైభవంగాను, కన్నుల పండువగాను నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచే ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల సందర్శనార్థం సిద్ధం చేశారు. మాధవస్వామివారికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, భగవత్‌ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి లక్ష తులసీ దళార్చన కార్యక్రమం వీనుల విందుగా కొనసాగించారు. మహాలక్ష్మీ హోమం, మహాపూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పం, తీర్థ, ప్రసాద వితరణ, మాధవస్వామివారికి, రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి శాంతి కల్యాణంను భక్తుల భక్తి పారవశ్యాల నడుమ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో స్వామివారిని నగరోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు వేదాంతం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ వేణుగోపాలరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాయితీపై సబ్సిడీ విత్తనాలు

బల్లికురవ: ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలుకావాల్సిన రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 20 ఆర్బీకేలకు 40 క్వింటాళ్ల జీలుగ, 40 క్వింటాళ్లు జనుము, 30 క్వింటాళ్లు పిల్లిపెసర్లు కేటాయించారని చెప్పారు. సబ్సిడీ పోను కిలో రూ. 44 జీలుగ జనుము, కిలో రూ. 67 పిల్లిపెసర్లు అందజేస్తున్నామని, రిజిస్ట్రేషన్ చేసుకుంటే వెంటనే అందజేస్తామని కుమారి వివరించారు.

సుందరయ్య సేవలు చిరస్మరణీయం



పర్చూరు బొమ్మల సెంటర్‌లో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

పర్చూరు (చినగంజాం): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆదివారం బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు టీ పేతురు ఆవిష్కరించారు. సుందరయ్య అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, బండారు చినదాసు, మత్తే డేవిడ్, ఎం సుబ్బారావు, సీఐటీయూ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల రూరల్: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్ల సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం సీపీఎం చీరాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్వీ రంగనాయకులు కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్.బాబురావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్. గంగయ్య హాజరై మాట్లాడారు. పుచ్చలపల్లి విద్యార్థి దశలోనే స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణా సాయుధ పోరాటం ద్వారా నైజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడి వేలాది మంది కూలీలకు భూములను పంచిపెట్టారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతగా సైకిల్ మీద పార్లమెంటుకు వెళ్లిన నిరాడంబరుడైన సుందరయ్య లాంటి నాయకుడు దేశ చరిత్రలో మరెవరూ లేరని చెప్పారు. ఏదైనా సమస్య మీద పార్లమెంటులో పుచ్చలపల్లి మాట్లాడుతుంటే మొత్తం సభ నిశబ్దంగా వినడమే కాకుండా నోట్ చేసుకునే వారని అన్నారు. ప్రజా సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన ఆయన లాంటి నాయకులు లేకపోవడం నేడు దేశం అనుభవిస్తున్న కష్టాలకు కారణంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వసంతరావు, కొండయ్య పాల్గొన్నారు.



చీరాలలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు